క్లుప్తంగా

వాహనాల తనిఖీ



వాజేడు: మండల పరిధిలోని ధర్మవరం గ్రామం సమీపంలో రహదారిపై పేరూరు ఎస్సై రమేష్ ఆధ్వర్యంలో ఆదివారం వాహనాలను తనిఖీ చేశారు. రహదారిపై వచ్చి వెళ్లే ప్రతీ వాహనాన్ని తనిఖీ చేశారు. ఇసుక లారీలను కూడా తనిఖీ చేశారు. ప్రయాణికుల వివరాలను అడిగి తెలుసుకోవడంతో పాటు వాహనంలోని బ్యాగులను క్షుణ్ణంగా సోదాలు చేశారు.

'కక్ష కట్టడం సరికాదు'

ఏటూరునాగారం: మండల కేంద్రంలో పోస్టాఫీసులో పనిచేస్తున్న తనపై కక్ష కట్టడం సరికాదని నాగేశ్వర్‌రావు అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఒకే ఇంటిలో రెండుసార్లు దొంగలు పడడం బాధాకరమన్నారు. గత ఏడాది అక్టోబర్‌లో ఆరోగ్య సమస్యలు ఉంటే వరంగల్‌కు వెళ్లడంతో దొంగలు పడి బంగారం, నగదు దోచుకున్నారన్నారు. ఇప్పుడు కంటి ఆపరేషన్ కోసం వెళితే శనివారం కూడా దొంగలు పడి రూ.15వేలు ఎత్తుకెళ్లారని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం ఆరు నెలల వ్యవధిలోనే ఒకే ఇంటిలో ఇలా దొంగలు పడుతున్నారంటే తనపై ఎవరు కక్ష కట్టారని వెల్లడించారు. ఈ విషయంపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

నాగుర్లపై ఆరోపణల వెనుక దుష్టశక్తులు



పరకాల: రాజకీయంగా ఎదుగుతున్న తెలంగాణ రైతు ఋణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లుపై సోమనాథ్ చిట్ ఫండ్ యాజమాని చేసిన ఆరోపణలను ఖండిస్తున్నట్లు ఆరెసంక్షేమ సంఘం, తెలంగాణ రైతువిభాగం నాయకులు తెలిపారు. పట్టణంలోని స్వర్ణగార్డెన్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. తెలంగాణ రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు చందర్‌రావు, ఆరెసంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు శంకర్‌రావు, లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ.. సోమనాథ్ చిట్ ఫండ్ యాజమాని దుమాల బాపురావు ఆత్మహత్యయత్నానికి నాగుర్ల వెంకటేశ్వర్లు పేరును ప్రస్తావించడం బాధ కలిగించిందన్నారు. వాస్తవానికి సోమనాథ్ చిట్‌ఫండ్‌తో పాటు ఆర్బిట్ ఫార్మా కంపెనీలో నాగుర్ల వెంకటేశ్వర్లు (37 శాతం వాటా) ద్వారా భాగస్వామ్యంగా ఉండి 2021 ఏప్రిల్ 10న ఇరువురి అంగీకారంతో తప్పుకోవడం జరిగిందన్నారు. తన ద్వారా చిట్‌ఫండ్‌లో సభ్యులుగా చేరిన వారికి న్యాయంగానే డబ్బులు ఇప్పించిన సంధర్భాలు ఉన్నాయని, మరికొందరికి న్యాయం చేయాల్సి ఉందన్నారు. కానీ ఏనాడు బాపురావును వేధించిన సందర్భాలు లేవన్నారు. నాగుర్లపై ఆరోపణల వెనుక కొన్ని దుష్టశక్తులు ఉన్నాయని ఆరోపించారు. ఈ సమావేశంలో ఆరెసంక్షేమ సంఘం నాయకులు లక్ష్మణ్‌రావు, శివాజీ, కందెరావు, వీరేష్‌రావు, రైతు విభాగం నాయకులు వరికెల కిషన్‌రావు, అన్నారెడ్డి, బాబుమియా పాల్గొన్నారు.

నిరుపయోగంగా నీటితొట్లు

- దప్పిక కోసం అల్లాడుతున్న మూగజీవాలు
- నిర్వహణను గాలికి వదిలేసిన అధికారులు

రేగొండ: వేసవిలో పశువుల దాహార్తి తీర్చాలని ఊరి బయట, పొలాలకు వెళ్లే ప్రధాన రహదారుల పక్కన ఏళ్ల కిందట నీటితొట్లు నిర్మించారు. వాటి నిర్వహణ సరిగా లేక నిరుపయోగంగా మారాయి. దీంతో మూగజీవాలు నీటి కోసం అల్లాడుతున్నాయి. ఉమ్మడి రేగొండ మండలంలో మొత్తం 37 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. గతంలో జాతీయ ఉపాధి పథకంలో పశువుల దప్పికను తీర్చాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం అన్ని గ్రామాల్లో నీటితొట్లను నిర్మించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు వాటిని ఉపయోగించిన దాఖలు లేవు. దీంతో పశువులు తాగునీటి కోసం అల్లాడుతున్నాయి. కొన్ని గ్రామాల్లో తాగునీటి ట్యాంకుల కింది భాగంలో నిర్మించిన వాటి నిర్వహణను పట్టించుకోవడం లేదు. నీటి సౌకర్యం లేని చోట అలానే వదిలేశారు. కొన్ని చోట్ల శిథిలావస్థకు చేరుకున్నాయి. వేసవిలో ఎండలు దంచికొట్టడంతో వాగులు, చెరువులు, కాలువలు పూర్తిగా ఎండిపోయాయి. తాగునీటి కోసం పశువులు గ్రామాల్లోకి వచ్చి నీటి కోసం అల్లాడుతున్నాయి. కొంత మంది రైతులు పశువుల దాహార్తి తీర్చేందుకు బోరు బావుల వద్ద నీటిని నిల్వ ఉంచి, పశువుల దాహార్తి తీర్చుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటితొట్లకు నీటి సౌకర్యం కల్పించాలని, వేసవిలో మూగ జీవాల దాహార్తి తీర్చాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.



నిజాంపల్లిలో వృథాగా ఉన్న నీటితొట్టి



లింగాలలో శిథిలావస్థలో నీటితొట్టి

వినియోగంలోకి తేవాలి

గ్రామాల్లో నిర్మించిన నీటితొట్లు అలంకారప్రాయంగానే మారాయి. ఎండలు ప్రారంభం కావడంతో పశువులకు నీరు దొరకడం లేదు. గ్రామాల్లో నిర్మించిన నీటితొట్లు నీటి సరఫరా లేకపోవడంతో నిరూపయోగంగా మారాయి. భూగర్భజలాలు అడుగంటడంతో చెరువులు, కుంటలలో కూడా నీరు లేవు. అధికారులు స్పందించి నీటితొట్లను వినియోగంలోకి తీసుకురావాలి.

- శ్రీనివాస్, రైతు

చెరువులు ఎండిపోయాయి

గ్రామాల్లోని చెరువులు, వాగులు ఎండిపోయాయి. పశువులు తాగేందుకు నీరు లేక ఇబ్బంది పడుతున్నాయి. నీరు ఎక్కడ ఉంటే అక్కడికి వెళ్లి పశువులు దాహం తీర్చుకుంటున్నాయి. గ్రామంలో ఉన్నటువంటి నీటితొట్లకు మరమ్మతులు చేయించాలి.

- రాజయ్య, పశువుల కాపరి

మద్యం తాగి వాహనాలు నడుపొద్దు

టేకుమట్ల: వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడుపొద్దని ఏఎస్సై అమరేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఎస్సై గోగికారి ప్రసాద్ ఆదేశాల మేరకు టేకుమట్ల–రాఘవరెడ్డిపేట ప్రధాన రోడ్డులో వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహన పత్రాలను తనిఖీ చేశారు. అలాగే బ్రీత్ ఎనలైజర్‌తో వాహనదారులను పరీక్షించి పలువురికి జరిమానా విధించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను పాటించాలన్నారు. వాహనదారులు తప్పనిసరిగా వాహన పత్రాలతో పాటు, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే ప్రమాదాల బారిన పడతారని, దాని వల్ల ఆర్థికంగా, శారీరకంగా నష్టపోవడంతో కుటుంబం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోటుందని అన్నారు. ఆయన వెంట కానిస్టేబుల్ మహేందర్, టీఎస్ఎస్పీ కానిస్టేబుళ్ల రమణ, రమేష్ తదితరులు ఉన్నారు.



బ్రీత్ఎనలైజర్‌తో పరీక్షిస్తున్న ఏఎస్సై

ప్రభుత్వాలు మారినా హత్యలు మారలే..

కాటారం: రాష్ట్రంలో ప్రభుత్వం మారినప్పటికీ పేద ప్రజల పక్షాన పోరాడే వారిని అంతమొందించడంలో తీరు మారలేదని అమరుల బంధుమిత్రుల సంఘం రాష్ట్ర నాయకులు శాంతక్క, సత్యవతి, విరసం ఉమ్మడి కరీంనగర్ జిల్లా నాయకులు బాలసాన్ని రాజయ్య, పౌరహక్కుల సంఘం నాయకులు వినోద్ ఆరోపించారు. ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన అన్నె సంతోష్ మృతదేహానికి స్వగ్రామం అంకుషాపూర్‌లో వారు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముమ్మాటికి ఇది రాష్ట్ర ప్రభుత్వ హత్యే అని, పాత సీసలో కొత్త సారా చూపించి ప్రజలను మోసం చేస్తున్నారని అన్నారు. సంతోష్‌ది బూటకపు ఎన్‌కౌంటర్ అని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు వారి పంతం నెగ్గించుకోవడం కోసం ఇలాంటి వాటికి పాల్పడుతున్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం సంతోష్ మృతికి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాఫంట్ నాయకులు కొంరయ్య, సీఎల్‌సీ వినోద్, పౌరసంఘం, పౌరహక్కుల నేతలు తదితరులు పాల్గొన్నారు.



మృతదేహం వద్ద మాట్లాడుతున్న నాయకులు

ఆగని రేషన్ బియ్యం దందా!

- అలసత్వం వహిస్తున్న అధికారులు
- డీలర్ల నుంచే సేకరిస్తున్న దళారులు



చిట్యాల: మండలంలో బియ్యం దందా మూడు పువ్వులు ఆరుకాయాలుగా కొనసాగుతోంది. ప్రభుత్వం ఒక్కరికీ ఆరు కిలోల బియ్యం ఇస్తోంది. దీంతో అదనుగా చేసుకుంటున్న బియ్యం అక్రమ వ్యాపారులు గ్రామాల్లో కొంత మందిని పైలెట్‌గా పెట్టుకుంటున్నారు. ఆ పైలెట్ గ్రామాల్లో ఎవరైనా నిఘా అధికారులు ఉన్నారా అని ఆరా తీసుకుంటూ బియ్యం వ్యాపారికి సమాచారం అందిస్తుంటారు. అలాగే బియ్యం గ్రామాల్లో కొనడానికి కొంత మంది కూలీలను ఏర్పాటు చేసుకుంటారు. గ్రామాలలోని ప్రజల వద్ద బియ్యం మధ్య దళారులు కిలో బియ్యం రూ.10 తీసుకొని బియ్యం వ్యాపారికి రూ.12 చొప్పున అమ్ముతారు. దీంతో ఆ బియ్యం వ్యాపారి గ్రామాల్లో ఉన్న బియ్యాన్ని ఒక చోట సమాకూర్చుకుని వాటిని ఒకేసారి లారీలో లోడు చేసుకుని మహారాష్ట్రకు తరలిస్తున్నారు.

పట్టించుకోని అధికారులు

కొంతమంది లబ్ధిదారులు రేషన్ షాపుల వద్దనే అమ్ముకుంటున్నారు. అలాగే రేషన్ షాపులో తీసుకున్న బియ్యం అదే డీలర్ వద్ద ఉంచడంతో అక్కడే ఉన్న మధ్య దళారి లబ్ధిదారులాగానే బియ్యం తీసుకుని అక్రమంగా పోగు చేసుకుంటు రాత్రి వేళల్లో సరఫరా చేసుంకుంటున్నారు. కొన్ని చోట్ల డీలరే లబ్ధిదారుడి వద్ద కొనుగోలు చేసి మధ్య దళారుడికి అమ్ముతున్నట్లు సమాచారం. సంబంధిత అధికారులు రేషన్ షాపుల వద్ద తనిఖీలు చేస్తేనే ఈ తతంగం అంతా బయట పడుతుందని ప్రజలు చర్చించుకుంటున్నారు. జిల్లా, మండల పౌర సరఫరాల శాఖ, రెవెన్యూ, పోలీస్ అధికారులకు బియ్యం అక్రమ రవాణా జరుగుతుందని తెలిసిన తెలియనట్లు చూస్తూండటం ఏంటని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు. దళారులు సంబంధిత అధికారులకు రూ.లక్షలలో ముడుపులు చెల్లిస్తున్నారని ఆరోపిస్తున్నారు. రేషన్ బియ్యం పక్కదారి పడుతుందని అనేక మార్లు పత్రికల్లో వచ్చిన, అధికారులకు సమాచారం ఇచ్చిన కనీసం ఏ అధికారి స్పందించి పట్టించుకున్న దాఖాలాలు లేవని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

మొగుళ్లపల్లి: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపు కోసం కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని అమ్మ గార్డెన్ ఫంక్షన్‌హాల్లో ఆదివారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆకుతోట కుమారస్వామి అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యకర్తలే పార్టీకి పునాదిరాళ్లని ప్రతి కార్యకర్త శక్తి వంచన లేకుండా సైనికుడిలా పని చేయాలన్నారు. దేశంలో నరేంద్ర మోదీ, రాష్ట్రంలో కేసీఆర్ ప్రజలకు చేసింది ఏమీ లేదని అన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉండగా జిల్లాలో 124 చెరువులు తెగిన కేసీఆర్ పట్టించుకోలేదన్నారు. 40 వేల ఎకరాలు ఇసుక మేటలు పడితే కన్నెత్తి చూడలేదని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అనుకున్న గడువులోపు నెరవేర్చామని తెలిపారు. ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు ప్రభుత్వం తీసుకుంటుందని అన్నారు. ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ దేశం కోసం ప్రాణాలు అర్పించారని, రాహుల్ గాంధీని ప్రధానమంత్రి చేసుకోవడం మనందరి బాధ్యత అన్నారు. మండలంలోని ఎంజేపీ, మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు సరైన వసతులు లేక ఇబ్బంది పడుతున్నారని ఆ సమస్యలను ఎన్నికల అనంతరం తక్షణమే పూర్తి చేస్తామని భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో భూపాలపల్లిని అభివృద్ధిలో మొదటి స్థానంలో ఉంచేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కటంగూరి రాంనరసింహారెడ్డి, గాజర్ల అశోక్, అప్పం కిషన్, తక్కళ్లపల్లి రాజు, క్యాతరాజు రమేష్, లింగారావు, రఫీ, రవి, సుదర్శన్ గౌడ్, పున్నం చందర్ రావు, మహేందర్ రెడ్డి, శివారెడ్డి, ప్రకాశ్‌రావు, రాజేశ్వర్‌రావు, వెంకటేశ్వర్‌రెడ్డి, స్వామి ఉన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

ముగిసిన చెన్నకేశవస్వామి జాతర

దామెర : మండలంలోని కోగిల్వాయి చంద్రగిరి చెన్నకేశవస్వామి జాతర ఆదివారంతో ముగిసింది. చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గుట్టపై 15 రోజులపాటు నిర్వహించిన జాతరకు భక్తులు భారీగా చేరుకొని స్వామివారికి మొక్కులు చెల్లించారు. పెద్ద గుండంలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి వారిని దర్శించుకున్నారు. టెంకాయలు సమర్పించి మొక్కులు చెల్లించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ప్రధాన అర్చకుడు వెంకట జోగాచార్యులు, పూజారులు దివి మురళీధరాచార్యులు, దివి కేశవాచార్యలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలతో శోభాయాత్ర నిర్వహించి గ్రామంలోని ఆలయానికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గుండ సురేష్, వైస్ చైర్మన్ పాలకుర్తి అశోక్, చుక్క సాంబయ్య పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.

ఆదివాసీ అభ్యర్థిని గెలిపించాలి



మాట్లాడుతున్న పూనెం ప్రతాప్

వాజేడు: మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని ఆదివాసీలందరూ ఆదివాసీ అభ్యర్థినే గెలిపించాలని గోండ్వానా సంక్షేమ పరిషత్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పూనెం ప్రతాప్ కోరారు. ఆదివారం మండల కేంద్రంలో ఆదివాసీ నాయకుడు బోదెబోయిన సురేష్ అధ్యక్షత నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అన్ని ప్రధాన పార్టీలు ఆదివాసీలను విస్మరించి లంబాడాలకు టికెట్ కేటాయించాన్నారు. మహబూబాబాద్ పార్లమెంట్ స్థానంలో ఆదివాసీల ఓట్లు అత్యధికంగా ఉన్నాయని అన్ని ఆదివాసీ సంఘాలు ముక్త కంఠంతో ఆదివాసీ అభ్యర్థికి మద్దతు ప్రకటించి ఓట్లు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాజబాబు, రాజ్‌కుమార్ ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

మంగపేట: మండలంలోని చంచుపల్లికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త శ్రీనివాస్ కొద్ది రోజుల క్రితం రోడ్డు ప్రమాదానికి గురై కోమాలోకి వెళ్లి ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం పొందుతూ శనివారం మృతి చెందాడు. దీంతో మృతుడి అత్యక్రియాలు ఆదివారం చంచుపల్లిలో నిర్వహించారు. కాగా, జెడ్పీ చైర్‌పర్సన్ నాగజ్యోతి అంతిమ యాత్రలో పాల్గొని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, నాయకులు తుమ్మ మల్లారెడ్డి, వత్సవాయి శ్రీధర్‌వర్మ, చిట్టిమళ్ల సమ్మయ్య, ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ తోట రమేష్, డైరెక్టర్ లక్ష్మణ్‌రావు, మండల నాయకులు నిమ్మగడ్డ ప్రవీణ్, రాజమళ్ల సుకుమార్, కర్రి శ్రీను, మోదుగు బాబు, చల్లగురుగుల తిరుపతి, మండల సోషల్ మీడియా ఇన్‌చార్జ్ గుడివాడ శ్రీహరి పాల్గొన్నారు.



పరామర్శిస్తున్న నాగజ్యోతి

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం

మంగపేట: మండలంలోని తిమ్మంపేటకు చెందిన దామ చంద్రశేఖర్ ఇటీవల మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని చంద్రశేఖర్‌తో కలిసి 2002–03లో కలిసి చదువుకున్న స్నేహితులు పరామర్శించారు. మృతుడి చిత్రపటం వద్ద నివాళులర్పించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి రూ.20,000 నగదును ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మృతుని స్నేహితులు ఆకిరెడ్డి ప్రకాశ్, యగ్గడి అర్జున్, చిలకమర్రి వేణు, శశికుమార్, కన్నా సంపత్, గాజుల సుమన్, దిడ్డి విజయ్‌కుమార్, దీగొండ బాబు, దామ శ్రీను తదితరులు పాల్గొన్నారు.



నగదు అందజేస్తున్న స్నేహితులు

నేడు సన్నాహక సమావేశం

శాయంపేట : మండల కేంద్రంలోని ఎస్వీకేకే ఫంక్షన్ హాల్‌లో సోమవారం కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు బుచ్చిరెడ్డి ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హాజరు కానున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు.

ఇద్దరిపై కేసు నమోదు

మహదేవపూర్: మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం సిబ్బందిపై దుసురుగా ప్రవర్తించిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రసాద్ ఆదివారం తెలపారు. ఎస్సై తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. ఆటో బోల్తా పడిన సంఘటనలో మృతి చెందిన నరేష్ మృతదేహాన్ని ఆరోగ్య కేంద్రంలోని మార్చురిలో ఉంచారు. కాగా, అర్థరాత్రి వచ్చిన నరేష్ బంధువులు ఒక్కసారిగా ఆస్పత్రి సిబ్బందిపై దుసురుగా ప్రవర్తిస్తూ దుర్భాషలాడారు. మహిళ నర్సు, డాక్టరు, సిబ్బందిపై దాడికి ప్రయత్నించారు. ఈ మేరకు డాక్టర్ మధవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంత్రి శ్రీకాంత్, శనిగరం సారయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

నాసిరకంగా బ్రిడ్జి నిర్మాణం

- నాణ్యతకు తూట్లు
- పట్టించుకోని అధికారులు


ఏటూరునాగారం: గిరిజన గుడాలకు వెళ్లే రహదారుల్లో వాగులపై నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణాలు నాసిరకంగా, నాణ్యత లోపంతో కొనసాగుతున్నాయి. ఏళ్ల తరబడి లోతట్టు ప్రాంతాల ప్రజలకు వారధిగా ఉండాల్సిన కట్టడాల నాణ్యతకు తూట్లు పడుతున్నాయి. మండలంలోని బుటారం గ్రామ సమీపన భూటారం జంపన్నవాగుకు కలిసే ఒర్రెపై బ్రిడ్జి నిర్మాణం కొనసాగుతోంది. వరదల సమయంలో ఈ లోయ నుంచి ఎక్కువ మొత్తంలో వరద బీభత్సంగా ఉంటుంది. ఈ బ్రిడ్జి నిర్మాణం జరిగితే గంటలగుంట, గుండెంగ వాయి, ఎలిశెట్టిపెల్లి గ్రామాల ప్రజలకు రహదారి ఏర్పడుతుంది. వరదల సమయంలో ఈ గ్రామాలతో సంబంధాలు తెగిపోతాయి. కాగా ఈ వాగుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టడానికి గత సంవత్సరమే రూ.4.5 కోట్లు మంజూరయ్యాయి. కాగా, అసెంబ్లీ ఎన్నికలు రావడంతో పనుల్లో ఆలస్యం అయింది. బ్రిడ్జికి ఇరువైపులా అప్రోచ్ రోడ్లను ఏర్పాటు చేయడం వాగుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టడానికి టెండర్ కాగా ఈ బ్రిడ్జి స్థలం రిజర్వ్ ఫారెస్ట్‌లో ఉండిపోయింది. అప్రోచ్ రోడ్లకు ఫారెస్ట్ శాఖ ఒప్పుకోలేదు. వెంకటాపురం(కె) మండలానికి చెందిన ఒకరు పనులను దక్కించుకున్నారు. ఇటీవల పనులు ప్రారంభమయ్యాయి. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ కానీ ఆర్అండ్‌బీ శాఖ ఉన్నతాధికారులు కానీ పనుల వద్ద ఉండటం లేదు. బ్రిడ్జి నిర్మాణం ఎత్తు 7 మీటర్లు, పొడవు 50 మీటర్లు, వెడల్పు 8 మీటర్లు, వాగు మధ్యలో నాలుగు పిల్లర్లతో బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి. మొదటగా గ్రౌండ్ లెవెల్ స్థాయిలో మూడు ఫీట్ల ఎత్తుతో ఐరన్ జాలి అల్లి కాంక్రీట్ నిర్మాణంతో కాంక్రీట్ పనులు కొనసాగుతున్నాయి. కాంట్రాక్టర్ గ్రౌండ్ లెవెల్ స్థాయిలో ఉపయోగించే ఐరన్, సిమెంట్ తక్కువ రేటు గల గ్రేడ్ వాటిని ఉపయోగిస్తున్నట్లు తెలిసింది. కాంక్రీట్‌ను పరిశీలిస్తే ఎర్రటి ఇసుక కనపడింది. 50 మీటర్ల పొడవున కూడా ఇలాగే కొనసాగినట్లు సమాచారం. ఇదేమిటని అక్కడ ఉన్న వర్క్ ఇన్‌స్పెక్టర్‌ను ప్రశ్నించగా డీఈ, ఎస్ఈలతో మాట్లాడుకోవాలని అంటున్నారని స్థానికులు వాపోతున్నారు. ఈ విషయాన్ని కాంట్రాక్టర్ దృష్టికి తీసుకెళ్లగా అసలు నాకు ఆ పని మీద శ్రద్ధ లేదని అధికారుల ఒత్తిడితో పనిని ఒప్పుకున్నట్లు తెలిపారు.



సమాంతరంగా లేని ఇనుప చువ్వల మ్యాట్

మరో కొండయి బ్రిడ్జిని తలపించనుందా!

గత సంవత్సరం వచ్చిన వరదలకు కొట్టుకుపోయిన కొండాయి వాగుపై గల బ్రిడ్జిని ఆలోచిస్తే దాన్ని మాదిరిగానే బ్రిడ్జి నిర్మాణ పనులు కనిపిస్తున్నాయి. కొండాయి బ్రిడ్జి నిర్మాణంలో గ్రౌండ్ లెవెల్ స్థాయిలో పనులు నాణ్యతగా లేకపోవడంతో పిల్లర్లు ఒరిగి బ్రిడ్జి కుంగిపోవడం కాలక్రమేనా వరదలకు కొట్టుకపోవడం జరిగిందని నిపుణులు తేల్చారు. కళ్ల ముందు నాసిరకంగా నిర్మించిన కొట్టుకుపోయిన బ్రిడ్జి కనిపిస్తున్నప్పటికీ అధికారులు, కాంట్రాక్టర్ ఏమి పట్టినట్లు వ్యవహరిచడం సరికాదు. పాలకులు పట్టించుకోకపోతే కొండాయి బ్రిడ్జికి పట్టిన గతే భవిష్యత్‌లో ఈ బ్రిడ్జికి కూడా పడుతుందని గిరిజనులు వాపోతున్నారు.



సిమెంట్, కంకర సరిగా కలపకుండా పోస్తున్న కాంక్రీట్

ముస్లిం మహిళలకు చీరల పంపిణీ

ములుగు రూరల్: నిరుపేద ముస్లిం మహిళలకు అమ్మ బాబాఖాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చీరలను పంపిణీ చేశారు. ఈ మేరకు ఆదివారం మేడారం ట్రస్టుబోర్డు డైరెక్టర్ ముంజాల భిక్షపతిగౌడ్ ముఖ్య అతిథిగా హాజరై పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ పండుగను నిరుపేద ముస్లింలు ఆనందంగా జరుకునేందుకు చేయూతనందించిన ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు భాబాఖాన్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యుడు రియాజ్ మిర్జా, దేవిరెడ్డి దేవేందర్‌రెడ్డి, విక్రమ్, కాసిం తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న భిక్షపతిగౌడ్

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
జయశంకర్ భూపాలపల్లి :
9951602872
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎ. మహేష్ (S.R) : 9505555291
కె. సుధాకర్ (ACO) : 9177258410